నమస్తే తెలంగాణ
జనగామ
5 | వరంగల్, శుక్రవారం 31 జనవరి 2025 | JANAGAON

420 సీఎం రేవంత్‌రెడ్డి

- ప్రభుత్వం ఏర్పడి 420 రోజులైనా ఒక్క హామీ నెరవేర్చలే..
- అసమర్థత సీఎంకు జ్ఞానోదయం కలిగించు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

తొర్రూరు : రేవంత్‌రెడ్డి 420 సీఎం అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలిచ్చి 420 రోజులు గడిచినా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. గురువారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి గాంధీ చౌరస్తా వరకు శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి వినతి పత్రాన్ని అందజేశారు. అసమర్థత కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని, దద్దమ్మ కాంగ్రెస్‌కు దారి చూపించాలని, చేతకాని ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని, సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞానోదయం కలిగించాలని వినతి పత్రంలో వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌పై విశ్వాసం ఉంచాల్సిన అవసరం ఉందని, పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావు ప్రజల తరపున ధ్వజమెత్తడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి వణుకు పుడుతున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చే వరకు ప్రజల తరపున పోరాటం చేస్తామన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుంటే ప్రజలు త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్తారని ఎర్రబెల్లి ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సభ్యుడు పొనుగంటి సోమేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ మంగళంపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ తూర్పాటి అంజయ్య, పట్టణ అధ్యక్షుడు బిందు శ్రీనివాస్, పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ ప్రదీప్‌రెడ్డి, పార్టీ కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, నాయకులు ఎన్నమనేని శ్రీనివాసరావు, మణిరాజు, తూర్పాటి రవి, శంకర్, జైసింగ్, ఎస్కే అంకూస్, కాలునాయక్, రాయశెట్టి వెంకన్న, జాటోత్ స్వామి, భాస్కర్, సోమలింగం, డిష్ శ్రీనివాస్, ఏల్పుకొండ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


హనుమకొండ: పబ్లిక్‌గార్డెన్‌లోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న దాస్యం, నాయకులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

తొర్రూరు : బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

420 హామీలు అమలు చేసే బుద్ధి ప్రసాదించు

ఓ మహాత్మా.. సీఎం మనసు మార్చు

'ఓ మహాత్మా.. సీఎం రేవంత్‌రెడ్డి మనసు మార్చు.. 420 రోజులైనా ఇచ్చిన 420 హామీలను అమలు చేయలేదు.. వాటిని నెరవేర్చే బుద్ధిని ప్రసాదించు' అంటూ గాంధీజీని బీఆర్ఎస్ నాయకులు వేడుకున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతిపిత విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పించారు. పలుచోట్ల శ్రేణుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, డాక్టర్ తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, డీఎస్ రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, పార్టీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ నాయకులు అలవికాని హామీలిచ్చారని, తీరా ప్రభుత్వం ఏర్పాటయ్యాక వాటి ఊసే ఎత్తడం లేదని ఎద్దేవా చేశారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ సర్కారు నిరుపేదలను మోసం చేసిందన్నారు. హామీలన్నీ అమలు చేసే వరకు ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాడతామని హెచ్చరించారు.

- నమస్తే నెట్‌వర్క్, జనవరి 30

- గాంధీజీని వేడుకున్న బీఆర్ఎస్ శ్రేణులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతిపిత విగ్రహాలకు వినతి పత్రాలు
- పలుచోట్ల ర్యాలీలు నిర్వహించిన నాయకులు
- పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యేలు

సంగెంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి


మహబూబాబాద్ రూరల్ : గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్

- హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని గాంధీజీ విగ్రహానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 420 రోజులైందని, ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో కోతలు, ఎగవేతలు, ఎదురుచూపులే మిగిలాయని ఎద్దేవా చేశారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి 420 రోజులైనా వాటిని నెరవేర్చడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చిన రోజు నుంచే కుంటి సాకులు, కొర్రీలతో లబ్ధిదారులను తగ్గించే ప్రక్రియను సర్కారు ప్రారంభించిందని ఆరోపించారు.
- మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గాంధీజీ విగ్రహానికి మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆరు గ్యారెంటీల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి నిరుపేదలను మోసం చేశారని అన్నారు.
- వరంగల్ స్టేషన్ రోడ్డులోని గాంధీ విగ్రహానికి వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. గ్రామాల్లో రైతు భరోసా, పట్టణాల్లో ఇందిరమ్మ ఇండ్ల పేరుతో మభ్యపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని, ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని అన్నారు.
- మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని గాంధీజీ విగ్రహానికి డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు నేరెడ క్రాస్‌రోడ్ నుంచి గాంధీ సెంటర్ వరకు పెద్ద ఎత్తున తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అధికారంలోకి వచ్చి 420 రోజులైనా ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పెద్దల మనసు మార్చాలని వేడుకున్నారు.
- జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని జాతిపిత విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో 420 ప్రభుత్వ పాలన కొనసాగుతున్నదని, సీఎం రేవంత్‌రెడ్డికి స్వర్గీయ ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ జ్ఞానోదయం కలిగించాలన్నారు.
- వరంగల్ జిల్లా సంగెం మండల కేంద్రంలోని గాంధీజీ విగ్రహానికి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వినతిపత్రం అందజేశారు. అసమర్థ ప్రభుత్వం కళ్లు తెరిపించు.. చేతగాని కాంగ్రెస్‌కు దారి చూపించి బుద్ధి ప్రసాదించు.. సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞానోదయం కలిగించు అని జాతిపితను వేడుకున్నారు.


స్టేషన్‌ఘన్‌పూర్ : గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

కురవి : బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ర్యాలీగా వస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

కలిమాబాద్: వరంగల్ స్టేషన్‌రోడ్డులోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

ఎన్నికల సాకుతో కాంగ్రెస్ కుట్రలు

- రైతు ఆత్మహత్యలు ఆపాలనే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అధ్యయన కమిటీ
- కుల్లు, కుతంత్రాలతో పరామర్శకు అనుమతి నిరాకరణ
- 1న కోర్టు అనుమతితో పల్లారుగూడలో సమావేశం
- పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సంగెం, జనవరి 30 : ఎమ్మెల్సీ ఎన్నికల సాకు చూపి వరంగల్ జిల్లా సంగెం మండలం పల్లారుగూడ మహారాజ్ తండాలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు బానోత్ తిరుపతి కుటుంబాన్ని బీఆర్ఎస్ అధ్యయన కమిటీ పరామర్శించకుండా కాంగ్రెస్ అడ్డుకున్నదని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు ఓర్వలేక పోలీసులపై ఒత్తిడి చేసి కమిటీ సభ్యులు, మాజీ మంత్రి హరీశ్‌రావు రాకుండా అనుమతిని రద్దు చేయించారని ఆయన మండిపడ్డారు. గురువారం ఆయన సంగెం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతు ఆత్మహత్యలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే 420 మంది ప్రాణాలు తీసుకున్నారని అన్నారు. రాష్ట్రంలో అన్నదాతలు ఆత్మహత్య చేసుకోకుండా భరోసా కల్పించేందుకే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అధ్యయన కమిటీని ఏర్పాటు చేశారన్నారు. మళ్లీ మన కేసీఆర్ ప్రభుత్వమే వస్తుందని, రైతులు ఆత్మహత్య చేసుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అధ్యయన కమిటీ పర్యటన జరిగితే కాంగ్రెస్ కనుమరుగవుతుందని భయపడి పోలీసులపై ఒత్తిడి తెచ్చారని అన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత, బీఆర్ఎస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి కాంగ్రెస్‌కు భయం పట్టుకుందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి, వారి సంక్షేమానికి ఎంతో కృషి చేశారన్నారు. రైతు బీమా, రైతుబంధు, అందుబాటులో ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు పండిన పంటలకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానన్న రేవంత్‌రెడ్డి ఆనవాళ్లే లేకుండా పోయే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కోర్టు అనుమతితో ఫిబ్రవరి 1న పల్లారుగూడలో సమావేశాన్ని నిర్వహించుకుంటామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, నాగార్జునశర్మ, గోవర్ధన్‌గౌడ్, వేల్పుల కుమారస్వామి, మాజీ సర్పంచ్‌లు గుండేటి బాబు, బిచ్చానాయక్, కుమారస్వామి, నాయకులు బోంపెల్లి దిలీప్‌రావు, సుతారి బాలకృష్ణ, సదానందం, వీరేశం, కొనకటి మొగిలి, నర్సింహస్వామి, పులి వీరస్వామిగౌడ్, పెంతల అనిల్, దోపతి సమ్మయ్యయాదవ్, గన్ను సంపత్, కిషన్‌నాయక్, మైముద్దీన్, యుగేంధర్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్‌లో కోర్టు భవనం

రేపు ప్రారంభించనున్న హైకోర్టు జడ్జి

స్టేషన్ ఘన్‌పూర్‌లోని న్యాయస్థాన భవనం

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 30 : మారుమూల ప్రజలకు సత్వరం న్యాయ సేవలు అందించేందుకు స్టేషన్‌ఘన్‌పూర్‌లో రేపు (శనివారం) న్యాయస్థానం భవనాన్ని హైకోర్టు జడ్జి శ్రీమతి సూరేపల్లి నంద ప్రారంభించనున్నట్లు జిల్లా జడ్జి డీ రవీంద్ర శర్మ గురువారం తెలిపారు. సుమారు 35 కి.మీ. దూర ప్రాంత ప్రజల శ్రమ తగ్గించాలని, వారి సౌలభ్యం కోసం ఈ న్యాయస్థానం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలతో స్టేషన్ ఘన్‌పూర్‌లో కోర్టు భవనం మంజూరు చేయగా, కలెక్టర్ ఎస్సీ బాలుర వసతి గృహం కేటాయించారు. హైకోర్టు భవన మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసిందన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి కే సందీప జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ ఇన్‌చార్జి జడ్జిగా వ్యవహరించనున్నారని ఆయన తెలిపారు.

రేపటి నుంచి రామగిరి రద్దు

కాజీపేట, జనవరి 30: సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో మిగిలిపోయిన రైల్వే ఇంజనీరింగ్ పనులు చేపడుతున్నందున కాజీపేట-బలార్ష సెక్షన్‌లో రాకపోకలు సాగించే రామగిరి (17035/17034) ఎక్స్‌ప్రెస్ రైలును శనివారం రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ రద్దు మార్చి 1 వరకు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే భద్రాచలం -బలార్ష, సిర్‌పూర్ టౌన్-భద్రాచలం రైల్వే స్టేషన్ల మధ్య నడిచే 17033/17034 సింగరేణి ప్యాసింజర్ రైలుకు ఫిబ్రవరి 1 నుంచి మార్చి 1 వరకు టౌన్ స్టేషన్‌లో హాల్టింగ్‌ను ఎత్తివేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించాలన్నారు.

చంపుతామని బెదిరించినందుకు..

కొయ్యడి కృష్ణ(ఫైల్)

- మనస్తాపంతో గీత కార్మికుడి ఆత్మహత్య
- సెల్ఫీ వీడియోలో చావుకు కారణాలు వెల్లడి

ఖానాపురం, జనవరి 30: రోడ్డు ప్రమాదం కేసులో బాధితుల బెదిరింపులకు భయపడి పురుగుల మందు తాగి గీత కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని రాగంపేటలో జరిగింది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొయ్యడి కృష్ణ (40) 2021లో ఖానాపురం పాత మజీదు వద్ద బైక్‌తో నల్లబెల్లికి చెందిన చినబాబును ఢీకొట్టడంతో మృతి చెందగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధిత కుటుంబానికి కొంత నగదు చెల్లించి కాంప్రమైజ్ చేసుకుంటామని గతంలో ఒప్పందం చేసుకున్నారు. కానీ ఈ నెల 29న కృష్ణ తాటిచెట్టు ఎక్కడానికి రాగా చినబాబుకు సంబంధించిన బంధువులు ఆరుగురు వచ్చి రూ.10 లక్షలు ఇచ్చి కాంప్రమైజ్ చేసుకోవాలని, లేకపోతే నిన్ను, నీ భార్యాపిల్లలను చంపుతామని బెదిరించారు. దీంతో మనస్తాపానికి గురైన కృష్ణ బుధవారం ఇంటి వద్ద సెల్ఫీ వీడియోలో తనను, తన భార్యాపిల్లలను ఆరుగురు వ్యక్తులు చంపుతామని బెదిరించినందుకే తాను చనిపోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించి గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రస్తుతం అతడి సూసైడ్ వీడియో వైరల్ అవుతోంది.

జనగామ ఎల్ఐసీలో రూ. 50 వేలు చోరీ

సీసీ పుటేజీ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

జనగామ చౌరస్తా, జనవరి 30 : జనగామ ఎల్ఐసీ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 12గంటలకు రూ.50 వేలు చోరీ అయినట్లు బ్రాంచ్ మేనేజర్ హరిలాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నెలాఖరు కావడంతో ఖాతాదారుల ప్రీమియం డబ్బులు చెల్లించేందుకు దేవరుప్పుల మండలం కడవెండికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ ఎనగందుల శ్రీనివాస్ జనగామ కార్యాలయానికి వచ్చాడు. క్యాష్ కౌంటర్ వద్ద శ్రీనివాస్ తన వెంట తెచ్చుకున్న బ్యాగులో నుంచి రూ.50వేల నగదును కౌంటర్‌లో చెల్లిస్తున్న సమయంలో పక్కనే ఓ బాలుడు చేతిలో ప్లాస్టిక్ కవర్‌తో నిల్చొని దొంగిలిచ్చినట్లు పేర్కొన్నారు. కాసేపటి తర్వాత తన జేబులో నగదు లేకపోవడంతో అనుమానం వచ్చి కార్యాలయంలో చెప్పడంతో సీసీ కెమెరాల్లో దృశ్యాలను పరిశీలించారు. అందులో ఓ బాలుడు నగదు దొంగిలిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. ఈమేరకు జనగామ అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీ పుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారని మేనేజర్ పేర్కొన్నారు.